క్లుప్తంగా

పైలెట్ ప్రాజెక్టుగా తొమ్మిది మండలాల్లో రీ సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

మామిడికుదురు: అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో తొమ్మిది గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి భూముల రీ సర్వే చేపట్టామని ఆర్డీఓ కె.మాధవి తెలిపారు. మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆమె వీఆర్వోలు, విలేజ్ సర్వేంట్లతో మ్యుటేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ఇంత వరకు మ్యుటేషన్‌కు వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటిలో మ్యుటేషన్ పూర్తి చేసినవి ఎన్ని, రిజెక్టు చేసినవి ఎన్ని, తిరస్కరించడానికి కారణాలు తదితర అంశాలపై ఆమె చర్చించారు. తొమ్మిది గ్రామాల్లో 15 వేల ఎకరాల్లో రీ సర్వే చేయాల్సి ఉందన్నారు. ఇంత వరకూ ఐదు వేల ఎకరాల్లో పూర్తయిందన్నారు. తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

దానియేలు మృతి తీరనిలోటు


దానియేలు సంస్మరణ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి

పి.గన్నవరం: కోనసీమలో వ్యాప్తంగా 25 ఏళ్లుగా పలు దైవిక, సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించిన పెదకందాలపాలెం న్యూజెరూషలేం చర్చి అధినేత జి.దానియేలు ఆకస్మిక మృతి తీరనిలోటని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి అన్నారు. స్థాని ఎన్‌జేఎం చర్చిలో సంఘ కార్యదర్శి యు.జాన్‌బాబు ఆధ్వర్యంలో పీపీఎఫ్ ప్రెసిడెంట్ ప్రశాంతకుమార్ అధ్యక్షతన బుధవారం జరిగిన దానియేలు సంస్మరణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమాల్లో దైవజనులు ఆర్.సుధాకర్, దానియేలు కుమారుడు ఫిలిఫ్ గిరి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో రుణ సదుపాయాలు

సఖినేటిపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పీఎంజీవై పథకం కింద ఉత్పత్తి యంత్రాల పథకాలకు సంబంధించి రుణ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ప్రధానమంత్రి 15 సూత్రాల రాష్ట్ర కమిటీ మాజీ మెంబర్, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌పాల్ అన్నారు. బుధవారం ఉయ్యూరువారి మెరక అపెక్స్ నిలయంలో సదరు పథకంలోని పలు అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాల్‌ను డాక్టర్ పాలపర్తి శేఖర్, డాక్టర్ తాడి మోహన్‌బాబు సత్కరించారు.

సర్వేయర్ల సమావేశం

ఆలమూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు బుధవారం గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. మండపేటకు చెందిన రైతు కాటా శ్రీరాములు భూమికి సంబంధించి సర్వే చేసేందుకు ఆలమూరు-1 గ్రామ సచివాలయం ఓ సర్వేయర్ లంచం డిమాండు చేశారనే ఆరోపణలపై ఈ సమావేశం గోప్యంగా నిర్వహించారు. ఇప్పటికే తహసీల్దార్ ప్రకాష్‌బాబును మండపేటకు చెందిన ఒక ప్రజాప్రతినిధితో పాటు డివిజనల్ స్థాయి రెవెన్యూ అధికారి కూడా లంచాల ఆరోపణలపై వివరణ కోరడంతో పాటు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. స్థానిక సర్వేయర్ వల్ల కలిగిన తప్పిదాన్ని సరిదిద్దుకునేందుకు నష్ట నివారణ చర్యల్లో భాగంగా హఠాత్తుగా ఈ సమావేశం జరిగినట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చాలదేవి, డి.సాయికిశోర్ అన్నారు. మండలంలోని ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లలతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రయోజనాలు

సఖినేటిపల్లి: రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.బోసుబాబు అన్నారు. బుధవారం అప్పనరామునిలంకలోని రైతు సేవా కేంద్రంలో సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు అధ్యక్షతన రైతు సమావేశం జరిగింది. వ్యవసాయ పథకాలకు లబ్ధిదారులను గుర్తించేందుకు కొత్తగా ప్రభుత్వాలు భూ ఆధార్, ఫార్మర్ రిజిస్ట్రేషన్ తీసుకు వచ్చినట్టు డీఏవో అన్నారు. ఇందుకు గాను రైతులు 25వ తేదీలోగా భూ ఆధార్ చేయించుకోవాలని సూచించారు. కాగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారా పీఎం కిసాన్ చెల్లింపు, పెట్టుబడి సాయం, పంటల బీమా, రుణాలు, వడ్డీ రాయితీ తదితర ప్రయోజనాలు పొందవచ్చని ఆయన తెలిపారు.

కలర్‌ఫుల్


వీణ


కొబ్బరి చిప్పలతో కళాత్మక వస్తువుల తయారీపై మహిళలకు శిక్షణ


కొబ్బరి చెట్లు


చిప్పలతో తయారు చేసిన అగరబత్తి స్టాండ్

- కొబ్బరి చిప్పలతో కళాత్మక వస్తువులు
- అబ్బుర పరుస్తున్న క్రాఫ్ట్ బొమ్మలు
- తర్ఫీదు పొందుతున్న మహిళలు

మామిడికుదురు: కోనసీమ అనగానే గుర్తొచ్చేది కొబ్బరి. ఈ కొబ్బరి కాయతో పాటు దాని నుంచి వచ్చే ప్రతి వస్తువు మనకు ఏదో విధంగా ఉపయోగపడుతుంది. కొబ్బరి డొక్క నుంచి పీచు ఉత్పత్తి అవుతుంది. ఈ పీచుతో ఎన్నో అద్భుతమైన బొమ్మలను రూపొందిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. వంట చెరకుగా వినియోగిస్తున్న కొబ్బరి చిప్పలతో కూడా ఆకట్టుకునే కళాత్మక వస్తువులను తయారు చేసే అంశంపై పాశర్లపూడి గ్రామంలో మహిళలు శిక్షణ పొందుతున్నారు. అదే గ్రామానికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల శిక్షణలో 30 మంది మహిళలు వివిధ వస్తువుల తయారీలో నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. అన్నమయ్య జిల్లా పూతనవారి పల్లెకు చెందిన క్రాఫ్ట్ నిపుణుడు అవ్వారు హరికృష్ణ మహిళలకు కళాత్మక వస్తువుల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. వంట చెరుకుగా ఉపయోగించే కొబ్బరి చిప్పల ద్వారా అందమైన బొమ్మల తయారీ చేయవచ్చని ఈ శిక్షణ ద్వారా నిరూపిస్తున్నారు.

ఎన్నో అద్భుతమైన బొమ్మలు

కొబ్బరి చిప్పలతో ఎన్నో అద్భుతమైన బొమ్మలను తయారు చేస్తున్నారు. టీ కప్పులు, మొబైల్ స్టాండ్లు, స్పూన్లు, ఐస్ క్రీమ్ బౌల్స్, వీణ, కొబ్బరి చెట్లు, అగర బత్తుల కుందులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, పూజ గదిలో వాడుకునే కుంకుమ బిరిణె, వేంకటేశ్వరస్వామి నామాలు, వినాయకుని ప్రతిమలు, వంటలో వినియోగించే గరిటెలు, చిన్న పిల్లలకు ఆహారం తినిపించే గిన్నెలు, పువ్వులు, పూల కుండీలు, తాబేలు వంటివి తయారు చేస్తున్నారు. మహిళల చేతిలో రూపుదిద్దుకుంటున్న బొమ్మలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

శిక్షణ ఎంతో బాగుంది



కొబ్బరి చిప్పలతో బొమ్మల తయారీపై మేము శిక్షణ పొందుతున్నాం. ఈ శిక్షణ మా జీవనోపాధికి ఎంతో ఉపయోగపడుతుంది. మాకు ఎన్నో విషయాలు నేర్పించారు. ఇంత కాలం కొబ్బరి చిప్పలను వంట చేసేందుకే వాడేవాళ్లం. కానీ వాటితో ఎన్నో రకాల బొమ్మలు తయారు చేయవచ్చని తెలిసింది. ఇది మా జీవనోపాధికి ఆధారం కానుంది.

– జగతా విజయదుర్గ, పాశర్లపూడి

ఎంతో మందికి ఉపాధి



కొబ్బరి చిప్పలతో కళాత్మక వస్తువుల తయారీపై మేము శిక్షణ పొందాం. ఈ శిక్షణను ఏర్పాటు చేసిన ఆక్సిజన్ అసోసియేషన్‌తో పాటు దాని వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరమ్ మహిళల ప్రగతికి ఎంతో తోడ్పడుతున్నారు. ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

– బొక్కా లక్ష్మీదుర్గ, పాశర్లపూడి

స్వయం సమృద్ధి సాధించాలి



కోనసీమలో లభించే కొబ్బరి చిప్పలతో ఎన్నో వస్తువులు తయారు చేయవచ్చు. పర్యావరణానికి హాని కలిగించని విధంగా పలు రకాలు బొమ్మలను రూపొందించడం ద్వారా మహిళలు కూడా ఆర్థిక స్వయం సమృద్ధి సాధించే అవకాశం ఉంది. ఎంతో ఉత్సాహంగా బొమ్మల తయారీలో శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ వారి జీవనోపాధికి ఉపయోగపడుతుంది.

– అవ్వారు హరికృష్ణ, శిక్షకుడు

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

పి.గన్నవరం: ఊడిమూడి శివారు చింతావారిపేట, ఉప్పులవారిపేటల్లో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కాంగ్రేగుల నరసింహం బుధవారం తన కుమార్తెలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీరియల్ నంబర్ 5లో తనకు ఓటేయాలని ఆయన కోరారు.

సఖినేటిపల్లి: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

అయినవిల్లి: ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు ఎనిమిది నెలల ఎన్డీయే కూటమి పాలనకు రెఫరెండంగా భావిస్తున్నట్లు ఎంపీ గంటి మాధుర్ హరీష్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ మోకా ఆనంద్ సాగర్, నియోజకవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్ అన్నారు. మండలంలోని పొట్టిలంక, కొండుకుదురు, ఎస్.మూలపాలెం, తొత్తరమూడి, అయినవిల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

హక్కుల పరిరక్షణకు పోరాటం

మలికిపురం: దళిత హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాటం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మలికిపురం పూలే అంబేడ్కర్ భవనంలో బుధవారం సీపీఐ రాష్ట్ర నాయకుడు దేవ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన నియోజకవర్గ దళిత హక్కుల పోరాట సమితి ప్రథమ మహాసభ జరిగింది. ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు మాట్లాడుతూ దేశంలో దళితులపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవడానికి పార్టీలకు అతీతంగా పోరాటం చేయాలన్నారు. రాజోలు నియోజకవర్గ ముఖ్య సలహాదారులుగా దేవ రాజేంద్రప్రసాద్, బత్తుల మురళీకృష్ణ, నియోజకవర్గ కన్వీనర్‌గా నల్లి బుజ్జిబాబు, కో కన్వీనర్‌గా చింతా శ్యాంబాబు, మరో 27 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

కొత్తపేట: ఛత్రపతి శివాజీ జయంతిని వాడపాలెంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ధర్మ సూత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు చోడిశెట్టి సురేష్‌కుమార్, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సింగిరెడ్డి గోవిందస్వామి సంయుక్త ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వాడపాలెం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించి కొత్తపేట బోడిపాలెం మీదుగా తిరిగి శివాజీ విగ్రహం వద్ద ముగించారు. శివాజీ విగ్రహానికి వారితో పాటు రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, ఆర్ఎస్ఎస్ కోనసీమ ప్రముఖ్ జగదీష్, టి.ఆంజనేయులు గ్రామ పెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్ నారాయణ, మండల బీజేపీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు పాల్గొన్నారు.


వాడపాలెంలో శివాజీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పాలూరి తదితరులు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలో లక్ష్మీ నరసింహ యువత ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

త్వరగా పరిహారం తీసుకోవాలి

మామిడికుదురు: జాతీయ రహదారి 216 రోడ్డు నిర్మాణంలో భాగంగా భూసేకరణకు అవార్డు పాసై భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు త్వరగా నష్ట పరిహారం తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. నిలిచిపోయిన రోడ్డు పనులను పరిశీలించారు. నిర్వాసితులతో మాట్లాడారు. తమకు చదరపు గజాల్లో పరిహారం చెల్లించాలని బాధితులు కోలా శ్రీను, బండారు సరయ్యకాపు తదితరులు కోరారు. ప్రజా ప్రయోజనం దృష్ట్యా రోడ్డు నిర్మాణం ఆగదని, ఇప్పటికే రెండు వైపులా రోడ్డు నిర్మాణం పూర్తి కావచ్చిందని కలెక్టర్ తెలిపారు. స్థానికంగా మాత్రమే నిర్వాసితుల నుంచి అభ్యంతరాలు ఉన్నాయని చెప్పారు. వెంటనే నష్ట పరిహారం తీసుకోవాలని, తదుపరి భూముల విలువ పెంపు డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. రోడ్డు నిర్మాణంలో అడ్డంకిగా ఉన్న గృహాల నిర్వాసితులు రోడ్డు నిర్మాణానికి సహకరించకపోవడం సరికాదన్నారు. ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా అంచనాల విలువలు గణించేందుకు సహకరించాలని కోరారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన భయం లేదన్నారు. నిర్వాసితులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. ఆర్డీఓ కె.మాధవి, ఎన్‌హెచ్ సహాయ ఇంజినీర్ వెంకటరమణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కె.ప్రభాకర్, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఆచార్యులు ఉన్నారు. ఈదరాడ గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. కరవాకలో చేపట్టిన చెరువుల ధ్వంసం పనులను పరిశీలించారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేస్తూ అక్రమ చెరువులను త్వరగా ధ్వంసం చేయాలని వారు అన్నారు.


మామిడికుదురులో ఎన్‌హెచ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

నైపుణ్య శిక్షణతో ఉత్తమ ఫలితాలు

మామిడికుదురు: అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న నైపుణ్య శిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పి.గన్నవరం ఐసీడీఎస్ సీడీపీఓ వై.విజయశ్రీ సూచించారు. మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ తరగతులను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ ప్రైమరీ స్కూల్లో బోధించేందుకు జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా 120 రోజుల శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఎంఈఓ మోకా వెంకన్నబాబు, హెచ్ఎం సీహెచ్ నిరంజని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.సుబ్బలక్ష్మి, పి.విజయలత, బి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

పి.గన్నవరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలని పి.గన్నవరం ఎంపీడీఓ కేవీ ప్రసాద్ సూచించారు. జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రానందం పాల్గొన్నారు.


శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

ఆటపాటలతో విద్య నేర్పాలి

అంబాజీపేట: బాల బాలికలకు ఆట పాటలతో విద్య నేర్పిస్తే త్వరితగతిన అర్థం అవుతుందని సీడీపీఓ వై.విజయశ్రీ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ జరిగింది. డీఆర్పీలు సీహెచ్ వెంకటసతీష్, బీఆర్ఎన్ శ్రీనివాస్, డీఎస్ రమేష్ పాల్గొన్నారు.

అయినవిల్లి: జ్ఞానజ్యోతి కార్యక్రమంతో చిన్నారుల్లో ప్రగతి వెలుగులు నింపాలని డీవైఈఓ పి.రామలక్ష్మణ మూర్తి అన్నారు. ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ పి.శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ గౌరీ, వరలక్ష్మి ఉన్నారు.


పి.గన్నవరంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

మలికిపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను ఉత్తమంగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ సీడీపీఓ వైకేడీ రమాదేవి అన్నారు. బట్టేలంకలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఈఓలు ఎం.విజయశ్రీ, వైవీ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కళాతపస్వికి నివాళి

కొత్తపేట: ప్రముఖ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన ప్రతి చిత్రం ద్వారా సమాజానికి సందేశాన్నిచ్చారని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ అన్నారు. విశ్వనాథ్ జయంతిని పురస్కరించుకుని ర్యాలి గ్రామంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరానికి చెందిన మచ్చ కుమార్‌రాజా సౌజన్యంతో వివిధ రంగాల్లో సేవాతత్పరులకు విశ్వనాథ్ స్మారక కళా సేవా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. అనూస్ సంస్థ ప్రతినిధి, ప్రముఖ ఇంద్రజాలికుడు చింతా శ్యామ్‌కుమార్ (శ్యామ్ జాదూగర్) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐ విద్యాసాగర్ పాల్గొన్నారు. కళా రంగంలో ఆల్ ఇండియా రేడియో కళాకారుడు మట్టపర్తి చంద్రశేఖర్, అన్నమాచార్య కీర్తనల ప్రచారకుడు కరుటూరి వెంకటశ్రీనివాస్, వర్ధమాన గాయకుడు రాజేష్, బహురూపాల కళాకారులు వులసు వీవీఎస్ సుబ్బారావు, పెద్దింటి రామంను సత్కరించారు. లండన్ ఫిజియోథెరపిస్ట్ మోహిత్‌కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణ అభినందనీయం

మలికిపురం: పేదలకు స్వయం ఉపాధి కోసం దాతలు ఇస్తున్న శిక్షణ అభినందనీయమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గుడిమెళ్లంకలో రిటైర్డ్ ఉద్యోగి కడలి బాబూరావు తన తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ట్రస్ట్ ద్వారా గ్రామంలోని నిరుపేద మహిళలకు కుట్టు శిక్షణా శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, ట్రస్ట్ చైర్మన్ కడలి బాబూరావు, మాజీ ఎంపీపీ కాకి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

పి.గన్నవరం: మండల బీజేపీ కార్యాలయాన్ని స్థానిక శింగంశెట్టి ప్రభావతమ్మ కాంప్లెక్స్‌లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా బుధవారం ప్రారంభించారు. మండల శాఖ అధ్యక్షుడు తిక్కా సత్యనారాయణ, నాయకులు ఆరుమిల్లి వీరభద్రరావు, చీకరమెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడిగా పెంటపాటి



పి.గన్నవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడిగా ముంగండ గ్రామానికి చెందిన పెంటపాటి శ్రీనివాస్ నియమితులయ్యారు. అన్నవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షునిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. తనను నియమించిన సంఘ పెద్దలకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులుగా పి.గన్నవరం మండలానికి చెందిన తమ్మన ప్రసాద్, కొల్లా శ్రీనివాస్, బొడ్డు గోపాలకృష్ణ, జల్లూరి సాయికృష్ణ, వధూవరుల పరిచయ వేదిక కన్వీనర్‌గా శ్రీఘాకోళపు లక్ష్మీపతిరావు, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా బొడ్డు సునీత నియమితులయ్యారు. వీరిని పి.గన్నవరం సంఘ అధ్యక్షుడు పాటోలు కృష్ణమూర్తి, బొడ్డు వెంకట సతీష్ తదితరులు అభినందించారు.

యూనిఫామ్ పంపిణీ

అయినవిల్లి: ముక్తేశ్వరంలో జయంతి రామయ్య పంతులు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంఈఓ పి.శ్రీనివాస్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం పాఠశాల హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ 32 మంది స్కౌట్స్‌కు, 32 మంది గైడ్లకు ఏకరూప దుస్తులు, బెల్ట్, టోపీలను పంపిణీ చేశామన్నారు. ఏకరూప దుస్తులకు పూర్వపు విద్యార్థి రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ అంబటి మురళీ మోహనరావు రూ.5 వేలు సమకూర్చారు. స్కౌట్ టీచర్ డి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వరరావు, జి.సాయి శ్రీనివాస్, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

రాజోలు: శివకోడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలోకి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లలితకుమారి కోరారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీకి 40 సీట్లు ఉన్నాయన్నారు. వచ్చే నెల 6వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను నమోదు చేసుకోవాలన్నారు.

పి.గన్నవరం: నరేంద్రపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ సీఈసీ, ఎంఈసీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం వచ్చే నెల 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ పున్నం వేణు తెలిపారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీలో 40 సీట్లు, ఎంఈసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

అంతా ఆధ్యాత్మిక పరవశం

వేడుకగా ఆలయ వార్షికోత్సవాలు

కొత్తపేట: వాడపాలెం గ్రామంలో అయ్యప్ప స్వామి, జ్ఞాన సరస్వతీదేవి ఆలయం 10వ వార్షికోత్సవాన్ని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బండారు బులితా, ఆలయ ఇన్‌చార్జి మట్టా బాబ్జి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు దొంతుకుర్తి రామచంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం నుంచి అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి నాగిరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు పెదపూడి శ్రీనివాస్, బాపిరాజు, వరగన వరబాబు, పప్పుల వెంకటేష్ తదితరులు, గ్రామ యువకులు సేవలు అందించారు.

5 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 5 నుంచి 9 వరకూ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు తెలిపారు. ఆ మేరకు పందిరి రాట వేశారు. అనంతరం బ్రహ్మోత్సవ కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి పవన్‌దీక్షితులు, పెద్దింటి సత్యకుమార్ బ్రహ్మత్వంలో మేనేజర్ గోరింట వినయ్‌కుమార్‌రాజు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పెద్దలు మంతెన ఆనందరాజు, వేగేశ్న కాశీ విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.


పెదపట్నంలంకలో వీరభద్రస్వామి సంబరం


చింతలూరులో గజ వాహనంపై వేంకటేశ్వరస్వామికి ఊరేగింపు

గజ వాహనంలో లక్ష్మీవల్లభుడు

ఆలమూరు: చింతలూరు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు గజ వాహనంలో శ్రీలక్ష్మీ వల్లభుడు అవతారంలో శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: పెదపట్నంలంకలో వీరభద్ర స్వామి సంబరం వైభవంగా జరిగింది. వైనతేయ గోదావరి నది వరకూ స్వామివారిని ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. అక్కడ నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం నది వద్ద యేడిద గోపాలకృష్ణ, పద్మ దంపతుల ఆధ్వర్యంలో వీరభద్రస్వామి సంబరాన్ని జరిపించారు. విఘ్నేశ్వర పూజ, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన జరిగింది.


ఆత్రేయపురంలో వేంకటేశ్వరస్వామి

అమ్మవారికి నదీ జలాలతో అభిషేకం

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డులో వేంచేసిన శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయ 30వ వార్షిక మహోత్సవాల సందర్భంగా 108 కలశాలతో పవిత్ర వైనతేయ నదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా శ్రీరామ సప్తాహం

ఆలమూరు: పినపళ్లలో మెరక వీధి రామాలయం వద్ద 29వ శ్రీరామ సప్తాహ మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజున గ్రామానికి చెందిన తోరాటి రుద్రయ్య దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 19న ప్రారంభమైన కార్యక్రమాలు 25వ తేదీతో ముగుస్తాయి. గ్రామానికి చెందిన ప్రముఖ భజన కళాకారుడు యేపూరి శివరాం నేతృత్వంలో శ్రీరామ భక్త భజన బృందం సుప్రభాత సేవ, పవళింపు సేవ నిర్వహించారు. సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పెదిరెడ్డి పట్టాభి, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, సంగిత పెదబాబు, చామకూరి శ్రీనివాస్, కొత్తూరి సాయి రామకృష్ణ, ఉండమట్ల శ్రీనివాస్, నామాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.